


యువత అభ్యున్నతే లక్ష్యం

పుంగనూరు పరిధిలోని సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లుగా ఎంపికైన వారితో మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. - 8లో



తెప్పపై సిరులతల్లి విహారం

తిరుచానూరులో శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సిరులతల్లి తెప్పపై విహరించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	42	29
చిత్తూరు	41	28
తిరుమల	37	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 196 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు మొత్తం 196 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ ద్వారకనాథరెడ్డి తెలిపారు. 59,001వ ర్యాంకు నుంచి 75వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు వెల్లడించారు. శనివారం 75,001నుంచి 92వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు వివరించారు.

వ్యవసాయశాఖలో బదిలీలు

తిరుపతి అర్బన్ : వ్యవసాయశాఖలో సాధారణ బదిలీలు చేపట్టారు. తొలి దశలో నలుగురు ఏడీలు, మరో నలుగురు ఏఓలకు స్థానచలనం కల్పించారు. సత్యవేడు ఏడీ రమేష్‌రెడ్డిని శ్రీకాళహస్తికి, తిరుపతి ఏడీసుబ్రమణ్యంను సత్యవేడుకు, శ్రీకాళహస్తి ఏడీ మనోహర్‌ను తిరుపతికి, సూళ్లూరుపేట ఏడీ నాగరాజును శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి, కావలి ఏడీ అనిత సూళ్లూరుపేటకు బదిలీ చేశారు. అలాగే తడ డో జ్యోత్మిరయిని దొరవారిసత్రం, ఇక్కడ పనిచేస్తున్న తులసీరామ్‌ను నింద్రకు, నింద్ర ఏఓ మురళిని కేవీబీపురం, ఇక్కడి ఏఓ నర్మదను చిత్తూరుకు, ప్రకాశం జిల్లాలో డెప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న దీపను వాకాడు ఏఓగా నియమితులయ్యారు.

జగనన్నకు చెబుదాం.. స్పందనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బాలాజీ

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమివ్వాలని, అర్జీల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జేసీ డీకే బాలాజీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అసైన్డ్ భూములకు సంబంధించిన ఫైల్స్, కోర్టు కేసుల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ కోదండ రామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఏడీ సర్వేయర్ జయరాజ్ పాల్గొన్నారు.

బదిలీలకు దరఖాస్తులు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు కేజీబీవీ ఉద్యోగుల బదిలీల కసరత్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ బదిలీలకు నిబంధనలకు లోబడి ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కేజీబీవీ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు, పాలనాపరంగా బదిలీ అయిన వారు ఈ బదిలీలకు అనర్హులని తెలిపారు. అలాంటి వారు ఉన్నట్‌లైతే కేజీబీవీ ఎస్‌వోల కవరింగ్ లెటర్లను ఈ నెల 7 లోపు చిత్తూరు డీఈవో కార్యాలయంలో ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని ఏపీసీ తెలిపారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్య కిలివేటి సంజీవయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సెజ్‌లలో ఏర్పాటు చేసిన 16 బహుళజాతి కంపెనీల్లో సుమారు వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఫెయిల్, పాస్ అయిన విద్యార్థులు, ఇంటర్, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన నిరుద్యోగులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించారు. జగనన్న అందిస్తున్న అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు శ్యామ్ మోహన్, గణేష్ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని ప్రభుత్వం కొత్తపుంతలు తొక్కిస్తోంది.. సాగును సంబరంగా మార్చేందుకు ఆధునిక విధానాలను ప్రవేశపెడుతోంది.. తక్కువ శ్రమతో అధిక దిగుబడి సాధించేందుకు వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద సుమారు 42 రకాల పరికరాలను పంపిణీ చేస్తోంది.. రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు రాయితీపై పనిముట్లు అందజేస్తోంది.. అర్హులందరూ విడతల వారీగా సామగ్రిని పొందేందుకు వెసులుబాటు కల్పిస్తోంది.. ఎక్కువ వ్యయప్రయాసలు లేకుండా సేద్యాన్ని సులభతరంగా తీర్చిదిద్దుతోంది.

ఆధునికంగా 'సాగు'దాం!



జెండా ఊపి ట్రాక్టర్ల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్



సబ్సిడీ నగదు చెక్కును రైతులకు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు
- వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద పంపిణీ
- పండుగలా జిల్లాస్థాయి కార్యక్రమం
- మంత్రి పెద్దిరెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు ట్రాక్టర్లు
- సేద్యానికి పగటిపూటే 9 గంటల విద్యుత్ సరఫరా

సాక్షి, చిత్తూరు : వ్యవసాయానికి పగటి పూటే 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఉదయం గుంటూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్ల పంపిణీ మెగా మేళా -2 ను ప్రారంభించారు. ఈ క్రమంలో చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి చేతులమీదుగా మొత్తం 237 గ్రూపులకు రూ.4.17 కోట్ల రాయితీతో 111 ట్రాక్టర్లు పంపిణీ చేశారు. మంత్రి



చిత్తూరులో పంపిణీకి సిద్ధంగా ట్రాక్టర్లు

మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు కల్పించడమే లక్ష్యంగా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిన ఘనతం ముఖ్యమంత్రికే దక్కుతుందని కొనియాడారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను రెండు నెలల్లో పూర్తి చేసి ఆ ప్రాంతంలోని అన్ని చెరువులను నీటితో నింపుతామని భరోసా ఇచ్చారు. పడమటి ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు మూడు రిజర్వాయర్లు నిర్మిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని, వాటిలో 22 లక్షల గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని వివరించారు. చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా గ్రూపుగా ఏర్పటిన రైతులకు రాయితీపై ట్రాక్టర్లు పంపిణీ చేశామన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పాలనతో వ్యవసాయం పండుగలా మారిందని తెలిపారు. చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప మాట్లాడుతూ రైతులపై మమకారంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారని, సాగును సంబరంగా మార్చేందుకు ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారని వివరించారు. చిత్తూరు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతులకు రాయితీ పై ట్రాక్టర్లను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ మాట్లాడుతూ రైత సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళి, చిత్తూరు నగర మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి, ఐసీడీఎస్ జోనల్ చైర్మన్ శైలజారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకట్‌రెడ్డియాదవ్, జెడ్పీ మహిళా స్థాయీ సంఘం చైర్మన్ భారతి, డీఆర్‌ఓ రాజశేఖర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక పాల్గొన్నారు.

సేద్యం.. సులభం



తిరుపతిలో రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కోరారు.శుక్రవారం తిరుపతి కలెక్టరేట్‌లో వైఎస్సార్ యంత్రసేవా పథకం జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు చేతులమీదుగా రైతులకు పరికరాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్రసేవ కింద రైతులకు ట్రాక్టర్లతోపాటు హార్వెస్టర్లు, నాగళ్లు, స్ప్రేయర్లు తదితర 42 రకాల పరికరాలను అందజేస్తున్నామన్నారు. వ్యవసాయ పెట్టుబడుల ఖర్చు తగ్గించడానికి ప్రభుత్వం సాయం చేస్తోందని చెప్పారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి నిధి కింద ఏటా విడతల వారీగా రూ.13,500 అందిస్తున్నామని తెలిపారు. సేద్యాన్ని సులభంగా మార్చేందుకు ఆధునిక పరికరాలను సమకూరుస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద విడతల వారీగా ట్రాక్టర్లు, వరికోత యంత్రాలతోపాటు పలురకాల పనిముట్లు అందిస్తున్నట్లు చెప్పారు. దీంతో బీడు భూములు సైతం సాగులోకి వస్తున్నాయని వివరించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా రైతులు గ్రూపుగా ఏర్పడి కేవలం పరికరం విలువలో పదిశాతం చెల్లిస్తే 40శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తుందని, 50శాతం బ్యాంకు రుణం మంజూరు చేయిస్తుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ అన్నదాతలకు అండగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ మొత్తం 445 ఆర్‌బీకేలకు గాను 429 కేంద్రాల్లో వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మెగా మేళా రెండో విడతలో భాగంగా 160 గ్రూపులకు రూ.13.69 కోట్ల విలువైన పనిముట్లను రూ.4.58 కోట్ల సబ్సిడీపై అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో 180 ట్రాక్టర్లు పంపిణీ చేశామని, ఇప్పుడు మరో 74 ట్రాక్టర్లు అందిస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్ ఏడీ ధనంజయరెడ్డి, శ్రీకాళహస్తి ఏడీ రమేష్‌రెడ్డి, తిరుపతి ఏడీ మనోహర్, సత్యవేడు ఏడీ సుబ్రమణ్యం, కలెక్టరేట్ ఏఓ గాయత్రి, శ్రీకాళహస్తి ఏఓ సుధాకర్ రెడ్డి, తొట్టంబేడు ఏఓ సురేంద్ర పాల్గొన్నారు

పదిశాతమే చెల్లించాం



ఒకప్పుడు ధనవంతులకు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మాలాంటి పేద రైతులకు కూడా ట్రాక్టర్లు వస్తున్నాయి. నేను కేవలం ట్రాక్టర్ విలువలో 10శాతం చెల్లించా..40శాతం సబ్సిడీ ఇచ్చారు. 50శాతం బ్యాంక్ రుణం ఇప్పించారు. దీంతో వ్యవసాయం సులభంగా మారుతుంది. పెట్టుబడులు తగ్గుతాయి.

– ఈగల హరిబాబు రాయల్, రైతు, గొల్లపల్లె, శ్రీకాళహస్తి మండలం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మాది వ్యవసాయం కుటుంబం. నేను శ్రీలక్ష్మీ శ్రీనివాస రైతు మిత్ర గ్రూపులో సభ్యుడిని. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద లబ్ధి పొందాం. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు తీసుకున్నాం. ష్యూరిటీతో పనిలేకుండా బ్యాంకు రుణం ఇప్పించారు. రైతులకు ఇంత సాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మాధవవర్మ, రైతు, బొమ్మరాజపురం, వడమాలపేట మండలం

రూ.15లక్షల పరికరాలు పొందాం



వ్యవసాయమే మాకు జీవనాధారం. రైతు భరోసా కేంద్రం ద్వారా వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద సుమారు రూ.15 లక్షల విలువైన పరికరాలు పొందా. ట్రాక్టర్, రెడ్ లాండ్స్ (గడ్డి కట్టే యంత్రం), స్ప్రేయర్స్, రోటోవేటర్స్ తదితర పనిముట్లు తీసుకున్నా. మా గ్రామంలో 15 వందల ఎకరాలు సాగులో ఉన్నాయి. ఈ సీజన్‌లో రెడ్ లాండ్స్ బాగా ఉపయోగపడింది. ముఖ్యమంత్రి జగనన్న మేలు మరువలేం.

– భాస్కర్‌రెడ్డి, రైతు, తొట్టంబేడు మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



మాలాంటి పేద రైతులకు ఇంతలా సాయం చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం. ప్రభుత్వం అందించిన సహకారంతోనే వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద రూ.5.19లక్షల సబ్సిడీపై ట్రాక్టర్, రోటోవేటర్లు, స్ప్రేయర్లు వంటి పరికరాలను తీసుకున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా మాకు అవగాహన కల్పించి మరీ పనుముట్లు అందజేశారు.

– శ్రీనివాసులు, రైతు, ఎర్రావారిపాళెం మండలం

బాధ్యత తీసుకుని..

భారం తప్పించి

- చంద్రగిరిలో చెవిరెడ్డి మార్కు సేవ
- ప్రైవేట్ బస్టాండ్ ఫీజు చెల్లించిన మోహిత్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు



గేటు కాంట్రాక్టర్‌కు నగదు అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్) : చంద్రగిరి నియోజకవర్గంలోని ఆటో కార్మికులకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అండగా నిలిచారు. పంచాయతీలు ఆటో డ్రైవర్ల నుంచి వసూలు చేసే గేటు రుసుము లేకుండా, ఉచితంగా రవాణా, పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల్లో ఇప్పటికే ఆటో కార్మికులు ఎలాంటి గేటు ఫీజు చెల్లించకుండా వాహనాలను నడుపుకునేలా చర్యలు చేపట్టారు. తాజాగా చంద్రగిరి పంచాయతీ పరిధిలో ఆటోలను ఉచితంగా తిప్పుకునే వెసులుబాటు కల్పించారు. గేటు వసూళ్లకు అనుమతి పొందిన గుత్తేదారుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తన సొంత నిధుల నుంచి రూ.7.10 లక్షలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కార్మికుడు తమ కుటుంబ సభ్యుడేనని తెలిపారు. అందుకే కార్మికులను ఆదుకున్నామన్నారు. అనంతరం ఆటో కార్మికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తమకు గేటు ఫీజు భారం తప్పించిన మోహిత్‌రెడ్డిని ఆటో డ్రైవర్లు గజమాలతో సత్కరించారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా, నష్టం వాటిల్లినా, పండుగ వచ్చినా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అండగా ఉంటున్నారని వెల్లడించారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆటో కార్మికులకు యూనిఫామ్‌ను వితరణగా అందించారు.

సంతోషంగా ఉంది



రోజంతా కష్టపడి ఆటో నడిపి బాడుగ కట్టి, పంచాయతీ గేటు చెల్లించి ఉత్త చేతులతో ఇంటికి వెళ్లిన రోజులు ఉన్నాయి. పచ్చడి మెతుకులు తినాలన్నా ఇబ్బంది పడుతూ ఉన్నాం. నెలకు రూ.2వేలకు పైగా గేటు చెల్లిస్తున్నాం. కానీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుణ్యమా అని ఇప్పుడు గేటు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోవడం ఆనందంగా ఉంది. రోజూ కొంత నగదును ఇంటికి తీసుకెళ్లగలమనే నమ్మకం వచ్చింది.

– నీలకంఠం, ఆటో కార్మికుడు, కాశిపెంట్ల

చల్లగా ఉండాలి



ఏ కష్టం వచ్చినా, ఇబ్బందులు వచ్చినా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుటుంబీకులు అన్నలా ఆదుకుంటున్నారు. యూనిఫామ్ కూడా ఉచితంగా అందించారు. జగనన్న వాహన మిత్ర ద్వారా డబ్బులు వస్తున్నాయి, ప్రస్తుతం చంద్రగిరిలో గేటు రుసుము చెల్లించాల్సి బాధ తప్పింది. చెవిరెడ్డి కుటుంబం పది కాలాలపాటు చల్లగా ఉండాలి.

– బాలకృష్ణ, ఆటో కార్మికుడు, అగరాల

రుణపడి ఉంటాం



చంద్రగిరి నియోజకవర్గంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నా. చెవిరెడ్డి కుటుంబం మమ్మల్ని అన్ని విధాలా ఆదుకుంటోంది. ఇప్పటికే దినసరి మార్కెట్ గేటు రుసుము లేకుండా చేశారు. ప్రతి ఏడాది కొత్త దుస్తులు ఇస్తున్నారు. స్వీట్లు పంపిణీ చేస్తున్నారు. ఇప్పుడు ఆటో డ్రైవర్లకు గేటు ఫీజు బరువు తప్పించారు. చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటాం.

– కరీముల్లా, ఆటో కార్మికుడు, చంద్రగిరి

ఆదర్శనీయుడు చెవిరెడ్డి



అందరు రాజకీయ నాయకులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదర్శనీయుడు. ఆయనలా ఉంటే రాష్ట్రంలో పేదరికమనేదే ఉండదు. ఎన్నికలకే పరిమితం కాకుండా.. ఎప్పుడూ జనంలోనే ఉంటారు. కష్టంలో అండగా నిలుస్తారు. సంతోషంలో భాగస్వాములవుతారు. అనుక్షణం ప్రజాసేవే పరమావధిగా శ్రమిస్తుంటారు. చెవిరెడ్డి కుటుంబం ఎప్పుడూ సేవలోనే ఉంటుందిన.

– రవి, ఆటో కార్మికుడు, పిచ్చినాయుడుపల్లె

వైభవంగా గోవిందుని రథోత్సవం



విశేషాలంకరణలో రథంపై కొలువైన స్వామివారు



రథంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామివారు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. సర్వాలంకారభూషితుడైన అనంత తేజోమూర్తి రథాన్ని అధిరోహించగా, చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి రథోత్సవం కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. స్వామివారి రథ సేవకులుకు, భక్తులకు మజ్జిగ, మంచినీరు, పానీయాలతో పాటు విసన కర్రలు వితరణ చేశారు. దారి పొడవునా భక్తులు మిరియాలు, కలకండను స్వామి వారి రథంపై చల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు స్వామి వారి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు అశ్వ వాహనం అధిరోహించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపీ శ్రీనివాస దీక్షితులు, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, సీఈ నాగేశ్వర రావు, డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు పాల్గొన్నారు.

శరవేగంగా చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణం



రోగులతో మాట్లాడుతున్న చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి

తిరుపతి తుడా : టీటీడీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ డిసెంబర్ నాటికి ఆస్పత్రిలో ఆరురకాల సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అవసరాలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బందిని నియమించుకుని, అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. అనంతరం హృదయాలయంలో జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, డైరెక్టర్ శ్రీనాథరెడ్డి, ఆర్ఎంఓ భరత్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా చంద్రగిరి ఐపీఎల్

- హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు
- పరుగుల ప్రవాహం సృష్టిస్తున్న బ్యాట్స్‌మెన్

తిరుపతి రూరల్ : చంద్రగిరి ఐపీఎల్ మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీల్లో బ్యాట్స్‌మెన్ జోరు కొనసాగుతోంది. గ్రామీణ యువత ఫోర్లు, సిక్సర్లతో బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వస్తున్న టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా తమ ప్రతిభను చాటుతున్నారు. బ్యాట్ చేతబట్టి బరిలో దిగిన ప్రతి ఒక్కరూ పరుగుల వర్షం కురిపించారు. ప్రస్తుతం లీగ్ దశ మ్యాచ్‌లు ముగిసి, మండలస్థాయి సెమీఫైనల్స్‌కు చేరడంతో ఆటగాళ్లు మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయం కోసం పోరాడుతున్నారు.

5 మైదానాల్లో 20 మ్యాచ్‌లు

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం నుంచి 13 గ్రౌండ్లలో రోజూ 52 మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా, ఇప్పటికే కొన్ని మండలాలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వందల సంఖ్యలో జట్లు వచ్చిన తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు చెందిన జట్ల మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో సెమీఫైనల్స్ రోడ్‌మ్యాప్‌లో ఆలస్యం అయింది. అందువల్లే శుక్రవారం తక్కువ మ్యాచ్‌లు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు 5 గ్రౌండ్లలో 20 మ్యాచ్‌లు మాత్రమే నిర్వహించారు. ఒక్కో గ్రౌండ్ నుంచి నాలుగు మ్యాచ్‌ల చొప్పున 5 గ్రౌండ్లలో 20 మ్యాచ్‌లు జరిపించారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు టోర్నమెంట్ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు అందించారు.



విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, రఘునాథరెడ్డి

ఉత్సాహంగా సెమీస్

సెమీఫైనల్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీ గోవిందపురం జట్టు, చిగురువాడ ఎలెవన్స్ జట్టుతో బరిలోకి దిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గోవిందపురం జట్టు తరపున ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ గా దిగిన శరణ్య, లోకేష్ చివరి వరకు పోరాడి వికెట్ నష్ట పోకుండా 129 పరుగులు సాధించారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేపట్టిన చిగురు వాడ జట్టు ఓటమిని చవిచూసింది. రామచంద్రాపురం మండలం నుంచి బరిలో దిగిన సి.రామాపురం, రాయలచెరువు జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోటీలో సి.రామాపురం విజేతగా నిలిచింది.







మ్యాచ్‌లలో క్రీడాకారుల ప్రదర్శన



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,770
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,547
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,200
రిటైల్ వెండి గ్రాము	రూ.75.20

శ్రీవారి సేవలో ప్రముఖులు



మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విశ్వరూప్ తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

క్లుప్తంగా

తిరుమలకు వెళుతూ గుండెపోటుతో యువతి మృతి

తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్తున్న ఓ యువతి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన అలిపిరి నడక మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. తిరుమల పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. అనంతపురం జిల్లా గోరంట్లకు చెందిన దివ్య(18) ఇంటర్ పూర్తిచేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు నడుచుకుంటూ బయలుదేరారు. గాలి గోపురం సమీపంలో వేగంగా నడుచుకుంటూ వచ్చి కూల్ డ్రింక్ తాగడంతో గుండె ఆగి అక్కడికక్కడే మృతి చెందింది.

యువకుడి ఆత్మహత్య



చెరువు గట్టున శ్రావణ్ మృతదేహం



శ్రావణ్ (ఫైల్)

రేణిగుంట : మండలంలోని తూకివాకం చెరువులో పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు.. ఏర్పేడు మండలం జింకలమిట్టకు చెందిన శరవణ కుమార్ అలియాస్ శ్రావణ్ (38) కొన్నేళ్ల కిందట నాగేశ్వరి అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు. ప్రస్తుతం రేణిగుంట బుగ్గవీధిలో నివసిస్తున్నారు. శ్రావణ్ స్థానిక పోస్టాఫీస్ వీధిలో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతని భార్య నాగేశ్వరి సీఆర్ఎస్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో శ్రావణ్ కొన్ని నెలలుగా మొబైల్ షాపును మూసేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం రాత్రి సినిమాకు వెళుతున్నట్లు భార్యకు చెప్పాడు. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయం తూకివాకం చెరువు వద్ద శ్రావణ్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువు గట్టున క్రిమిసంహారక మందు సీసా, కూల్‌డ్రింక్ ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : యువత అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి మారుతీనగరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడారు. ముందుగా పుంగనూరు నియోజకవర్గంలో సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లుగా ఎంపికైన అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నిరుద్యోగులు లేని నియోజకవర్గంగా పుంగనూరును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే పీఎల్ఆర్ జాబ్ మేళా ద్వారా ఇప్పటికే వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని వెల్లడించారు. ఈ క్రమంలోనే 19 సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేసేందుకు 70మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. త్వరలోనే నియామక పత్రాలను సైతం అందించనున్నట్లు తెలిపారు.


8 నుంచి చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్సవాల కోసం ప్రత్యేకంగా కమిటీలు నియమించినట్లు చెప్పారు. మీడియా కమిటీకి చైర్మన్‌గా కనసాని వేణుగోపాల్, ఫుడ్ కమిటీకి కె.రామ్మోహన్‌రెడ్డి, పబ్లిసిటీ కమిటీకి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, రిసెప్షన్ కమిటీలకు కళత్తూరు జనార్దన్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్‌రెడ్డి, సెక్యూరిటీ కమిటీకి భాస్కర్‌రెడ్డి, వాటర్, మజ్జిగ స్టాల్స్ కమిటీకి వంకా దినేష్, శానిటేషన్ కమిటీకి ఓలేటి బాలసత్యనారాయణ, గ్రామోత్సవ కమిటీకి కర్లపూడి సురేష్‌బాబు, సాంస్కృతిక కమిటీకి ఎంఎస్ రెడ్డి, ఉమెన్ వలంటీర్స్ కమిటీకి పద్మజ, బి.సునీత, మారెమ్మ, ఎన్.నాగమణి, తెప్పోత్సవ కమిటీకి నరేష్, మహిషాసుర మర్దిని కమిటీకి కళత్తూరు శేఖర్‌రెడ్డి, సుడిమాను కమిటీకి జెట్టి వేణుయాదవ్, ట్రాఫిక్ కమిటీకి మీజూరు రామకృష్ణారెడ్డి, ప్రసాదం కమిటీకి అయితా శ్రీధర్‌ను చైర్మన్లుగా నియమించినట్లు వివరించారు.

తెప్పపై సిరులతల్లి విహారం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పుష్కరిణిలో తెప్పపై కొలువుదీరి భక్తులను కటాక్షిస్తున్న పద్మావతీదేవి

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరులో కొలువైన శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం సాయంత్రం అమ్మవారు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం 3గంటలకు అమ్మవారిని ఆలయం నుంచి వేంచేపుగా పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాడ మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు వైభవంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30గంటలకు అమ్మవారు తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో మూడు పర్యాయాలు విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. రాత్రి 7.30గంటలకు సర్వాంగ శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, అర్జితం, వాహనం ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గజవాహన సేవ :

తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం రాత్రి 8.30గంటలకు శ్రీపద్మావతి అమ్మవారు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించనున్నారు.

ప్రమాదంపై రాజకీయాలు దారుణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం : బాణసంచా గోదాములో అగ్ని ప్రమాద ఘటనపై రాజకీయాలు చేయడం దారుణమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండిపడ్డారు. శుక్రవారం వరదయ్యపాళెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాదం సంభవించిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారని, బాధిత కుటుంబాలకు 24 గంటలలోపే రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించామన్నారు. విషాద సమయంలో బాధితులకు అండగా నిలవాలే కానీ, రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూడడం హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రమాద మృతులకు దహన సంస్కారాలు జరగకుముందే సంబంధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించామన్నారు. చెక్కుల పంపిణీకి కలెక్టర్‌తో కలిసి వచ్చిన తనను అడ్డుకునేందుకు కొందరు యత్నించడం సరికాదని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరి ప్రమేయం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా మరణించి వారి కుటుంబాలకు అండగా నిలబడ్డామని వెల్లడించారు. మాటలు చెప్పి, తప్పించుకుపోయేవారిని ప్రజలు గుర్తించాలని సూచించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, వినోద్‌యాదవ్ పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ



బాలికల పాఠశాలను తనిఖీ చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్



డీఈఓ శేఖర్‌తో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

- టీచర్ సెలవు పెడితే సీఆర్పీలు క్లాసులు తీసుకోవాలి
- ఒక్కరోజు మూతపడినా సీఆర్పీలదే బాధ్యత
- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశం
- డీఈఓ శేఖర్ పనితీరుపై మండిపాటు

చంద్రగిరి(తిరుపతి రూరల్): మెరుగైన విద్యా వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఏకోపాధ్యాయ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి 9.40 గంటల నుంచి ఆయన చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. నాడు–నేడు పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులు ఎంతమంది ఉంటున్నారు, ఈఏడాది 10వ తరగతి విద్యార్థులకు వచ్చిన మార్కులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.. అంటూ ఆరా తీశారు. ఈసందర్భంగా ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 90,603 సింగిల్ టీచర్ స్కూళ్లు ఉన్నాయన్నారు. వారు ఏదైనా సమస్యపై సెలవు పెడితే ఆరోజు స్కూల్‌ను మూసివేస్తున్నారని, లేకపోతే విద్యార్థులే పాఠాలు చెప్పుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయన్నారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా 3,012 మంది సీఆర్పీలు ఉన్నారని, సింగిల్ టీచర్ లీవ్ పెడితే సీఆర్పీలు క్లాసులు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా సీఆర్పీలు నిర్లక్ష్యంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఈఓపై మండిపాటు

అనంతరం స్కూల్ ఆవరణలో ఉన్న పుస్తకాల గోడౌన్‌ను ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ చేశారు. జిల్లాకు ఎన్ని పుస్తకాలు అవసరం, ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు వచ్చాయి, ఇంకా ఏ సబ్జెక్టు పుస్తకాలు రావాల్సి ఉందంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ప్రశ్నల వర్షం కురిపించారు. డీఈఓ శేఖర్ అసత్యాలతో కూడిన సమాధానాలు చెప్పడం గుర్తించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఆయనపై మండిపడ్డారు. కనీస సమాచారం లేకపోతే జిల్లాను ఎలా నిర్వహిస్తారు.. మీ సేవలు అవసరం లేదనుకుంటా.. అంటూ మండిపడ్డారు.

ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళిక

- అధికారులకు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : తిరుమల ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, టీటీడీ అధికారులతో ఈవో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవీ.

- మొదటి (డౌన్) ఘాట్ రోడ్డులో 1వ మలుపు, 7వ మైల్, అలిపిరి డౌన్ గేట్, అప్ ఘాట్ రోడ్డులో లింక్ రోడ్డు, సహజ సిద్ధంగా ఏర్పడిన ఆర్చి (గరుడ ఆకారం), దివ్యారామం ప్రాంతాల్లో చెక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి.
- రెండవ (అప్) ఘాట్ రోడ్డులో లాగా డౌన్ ఘాట్ రోడ్డులో కూడా కాంక్రీట్ రీటైనింగ్ వాల్స్ నిర్మించాలి.
- ఏ రకమైన వాహనాలను ఘాట్ రోడ్డులో నిషేధించవచ్చో ప్రణాళికలు సిద్ధం చేయాలి.
- ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను విరివిగా ఏర్పాటు చేయాలి.
- ఘాట్ రోడ్లలో వాహనాలు నడిపేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపేలా నిరంతరం కరపత్రాలు పంపిణీ చేయాలి.
- అంబులెన్స్‌లు , రెస్క్యూ టీమ్‌లు అవసరమైన పరికరాలతో సదా సన్నద్ధంగా ఉండాలి.
- ఘాట్ రోడ్లలో ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఓవర్ టేక్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎఫ్ఏసీఏవో బాలాజి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, టీటీడీ ఇంజినీరింగ్ సలహాదారు రామచంద్రారెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ , బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి , రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్ రెడ్డి, ఇంచార్జ్ ఆర్టీవో రవీంద్రనాథ్ సమావేశంలో పాల్గొన్నారు.